batukammanews.com TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

■ మంగళవారం । 1 సెప్టెంబర్ 2026 । ■ 9 పేజీలు



## వెంకంపల్లి వద్ద చిరుత కలకలం

నాగిరెడ్డిపేట మండలం లోని వెంకంపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో చిరుతపులి ప్రత్యక్షం కావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం ఉదయం సత్యనారాయణ అనే రైతు తన పొలానికి వెళ్తున్న సమయంలో కొంత దూరంలో చిరుత కనిపించింది. దీంతో ఆందోళన చెందిన అతడు వెంటనే గ్రామానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశాడు.

■ ఏ తప్పు చేయకున్నా జైల్లో పెట్టారు
■ నాలుగు ఏళ్లు సీబీఐ, ఈడీలు వేధించినా ధైర్యం సడలలేదు!
■ ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలన్న సంకల్పంతో ముందుకు వచ్చా
■ వేముల ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను
■ నా ఉసురు వేముల ప్రశాంత్ రెడ్డికి తప్పకుండా తగులుతుంది
■ కేసీఆర్‌ను, నన్ను వేరు చేసింది ఆయనే..
■ బాల్కొండలో వెంటపడి ఓడిస్తాం
■ ఎంపీ అర్వింద్ ఏడేళ్లుగా గాడిదల పళ్లు తోముతున్నారా?
■ బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై తీవ్రధ్వజం
■ నిజామాబాద్‌లో ఐదుకు ఐదు సీట్లు గెలుస్తాం!
■ వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
■ ఇందూరు పాంచజన్య మహాసభలో 'తెలంగాణ రక్షణ సేన' అధినేత్రి కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు..

■ నిజామాబాద్ బతుకమ్మ, ప్రతినిధి

"ఏ తప్పు చేయకపోయినా అన్యాయంగా జైల్లో పెట్టారు... సీబీఐ, ఈడీలు నాలుగేళ్లు వేధించినా మీ నిజామాబాద్ బిడ్డ నిప్పులా నిలబడింది తప్ప తలవంచలేదు! తండ్రీకూతుళ్లను విడదీసిన వేముల ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను, నా ఉసురు ఆయనకు ఖచ్చితంగా తగులుతుంది!" అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఇందూరు గడ్డపై పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన 'పాంచజన్య మహాసభ' వేదికగా ఆమె ఆక్రోశం, ఆవేదన, పొలిటికల్ శపథాలతో విస్ఫోటనం చెందారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నించకుండా బీఆర్ఎస్ నేతలు నిద్రపోతున్నారని మండిపడిన కవిత, రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయడంతో పాటు నిజామాబాద్ జిల్లాలోని ఐదుకు ఐదు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని తీరతామని గర్జించారు.

-సమగ్ర వార్తలు, దృశ్యమాలిక లోపలి పేజీల్లో

### ఇందూరు గడ్డపై కవిత రణశంఖం

# ఏ తప్పు చేయలేదు.. తలవంచేది లేదు..!






వివరాలు2లో



వీడియోకాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్

### భూసేకరణ ప్రక్రియ
## వేగవంతం చేయాలి

■ రైల్వే ప్రాజెక్టుల్లో జాప్యం వద్దు ■ స్థల సేకరణ పూర్తి చేయాలి
■ నష్టపరిహారంలో సానుకూల ధోరణి అవలంబించండి..
■ కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో సీఎస్ సంజయ్ జాజు

రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రవాణా శాఖ ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

### సీడ్ గణపతిని పూజిద్దాం
## ప్రకృతిని కాపాడుకుందాం!



■ 'సీడ్ గణేషా' ఆవిష్కరించిన మెగాస్టార్ చిరంజీవి, మాజీ ఎంపీ సంతోష్ కుమార్

ప్రకృతి సంరక్షణ కోసం పచ్చదనం పెంపుకోసం ఈ సారి అందరూ సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించి ఆ తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేయడం వల్ల.. వినాయకుడు మొక్కై ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తాడని తెలిపారు.

### గణేష్ నవరాత్రులు
## ప్రశాంతంగా నిర్వహిద్దాం



» డీజేలకు అనుమతి లేదు..
» విద్యుత్ తీగలు, విగ్రహాల ఎత్తుపై ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి..
» నేటి నుంచి జిల్లాలో 30పోలీస్ యాక్ట్ అమలు
» కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర..

కామారెడ్డి జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పిలుపునిచ్చారు. సోమ వారం కళాభారతీ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది విగ్రహాల రవాణా సమయంలో విద్యుత్ తీగలు తగిలి జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి విగ్రహాల ఎత్తు, రవాణా విషయంలో కఠిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద దొంగతనాల నివారణకు సీసీటీవీ కెమెరాలు, రాత్రివేళల్లో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వివరాలు3లో

న్యాయ వివాదాల పరిష్కారానికి 'లోక్ అదాలత్' ఉత్తమ మార్గం 4

# భూసేకరణ వేగవంతం చేయాలి

- రైల్వే ప్రాజెక్టుల్లో జాప్యం వద్దు, నష్టపరిహారంలో సానుకూల ధోరణి అవలంబించండి..
- కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో సీఎస్ సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్

**నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** రాష్ట్రంలో చేపట్టే రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. రైల్వే లైన్ల విస్తరణ, డబ్లింగ్, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించి ఆయా జిల్లాలలో చేపట్టాల్సి ఉన్న భూ సేకరణ ప్రక్రియ విషయమై సీ.ఎస్ సంజయ్ జాజు సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, దక్షిణ మధ్యరైల్వే ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీ.ఎస్ ఆయా జిల్లాల వారీగా నిర్దేశిత రైల్వే ప్రాజెక్టుల కోసం అవసరమైన స్థల సేకరణకై ఇప్పటివరకు తీసుకున్న చర్యల గురించి సంబంధిత కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అనవసర జాప్యానికి తావు లేకుండా భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులతో, భూ యజమానులతో సంప్రదింపులు జరుపుతూ, నష్టపరిహారం నిర్ణయంలో సానుకూల ధోరణిని అవలంభించాలని సూచించారు. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలలో అలసత్వం వహించవద్దన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో రైల్వే ప్రాజెక్టుల కు సంబంధించి నిజామాబాద్ శివారులో బైపాస్ లైన్ కోసం భూసేకరణ ప్రక్రియ పురోగతిలో ఉందని కలెక్టర్ భవేష్ మిశ్రా సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. నిజామాబాద్ మీదుగా కొనసాగే ముత్కేడ్ – మేడ్చల్ డబ్లింగ్ పనులకు కూడా భూసేకర ణలో ఎలాంటి ఇబ్బందులు లేవని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైల్వే ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్ష నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

# కామారెడ్డి జిల్లాలో నెల రోజుల పాటు 'పోలీస్ యాక్ట్ 30, 30(ఎ)' అమలు

- నేటి నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా ఆంక్షలు
- ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, సభలు నిర్వహించడం నిషేధం
- శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించేది లేదు
- జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర



**కామారెడ్డి, ఆగస్టు 31 (బతుకమ్మ) :** కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను పటిష్టంగా పరిరక్షించడం, ప్రశాంత వాతావణాన్ని కాపాడటమే లక్ష్యంగా సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెల రోజుల పాటు '30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861' అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. జిల్లా పరిధిలో పోలీసు అధికారుల ముందస్తు రాతపూర్వక అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, బహిరంగ సభలు మరియు సమావేశాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజా ధనానికి, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే ఎలాంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకూడదని సూచించారు. పోలీసుల అనుమతి లేకుండా నిబంధనలు ఉల్లంఘించి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినా, ప్రజల నిత్యజీవితానికి విఘాతం కలిగించినా సంబంధిత వ్యక్తులు మరియు నిర్వాహకులపై చట్టరీత్యా తీవ్రమైన కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు పోలీసు వ్యవస్థకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ రాజేష్ చంద్ర విజ్ఞప్తి చేశారు.


ప్రజావాణి కార్యక్రమంలో బాధితుల అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇతర అధికారులు

# 'ప్రజావాణి'కి ఫిర్యాదుల వెల్లువ

- నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఒక్కరోజే 159 అర్జీలు
- పెండింగ్ పెట్టకుండా పరిష్కరించాలని ఆదేశం

**నిజామాబాద్ అర్బన్,ఆగస్టు 31 (బతుకమ్మ) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన సీనియర్ పోలీసు అధికారులను సన్మానిస్తున్న పోలీస్ కమిషనర్ సాయిచైతన్య

# కలకాలం నిలిచే సేవలు

- పదవీ విరమణ పొందిన పోలీసులకు వీడ్కోలు
- మచ్చలేని సేవా ప్రస్థానంతో రిటైర్మెంట్ పొందడం ఎంతో అభినందనీయం..
- నిజామాబాద్ సీపీ సాయిచైతన్య

**నిజామాబాద్ క్రైం, ఆగస్టు 31 (బతుకమ్మ) :** పోలీస్ శాఖలో ఎంతో పనివత్తిడితో విధులు నిర్వహించి ఎలాంటి రిమార్కు లేకుండా పదవి విరమణ చేయడం ఎంతో గోప్ప విషయమని ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. సోమవారం పదవి విరమణ వీడ్కోలు కార్యాక్రమం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించారు. 3వ టౌన్ ఏఎస్సై గంగాదర్ గౌడ్, ఆర్.ఎస్.ఐ, ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్ అమీరుద్దీన్, ఏ.ఆర్ కానిస్టేబుల్ కె. అశోక్ లను శాలువలతో సత్కరించి పదవి విరమణ శుభాకాంక్షలు సర్టిఫికేటు (జ్ఞాపికలతో) సీపీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ మీరు పోలీస్ డిపార్టుమెంటు కు చేసిన సేవలు ఎంతో ఘననీయమని, పదవి విరమణ అనంతరం ఎలాంటి అవసరం వచ్చిన మీకు ఎల్లవేళల సహాయపడుతామని అన్నారు. మీరు మీ కుటుంబ సభ్యులు అయురారోగ్యాలతో ఉండాలని, మీ పిల్లల భవిష్యత్తుభాగుండాలని ఆకాంక్షించారు. ఈ వీడ్కోళ్లు కార్యక్రమంలో ఏ.ఆర్ హెడ్ క్వార్టర్స్ ఏ.సి.పి శ్రీరాములు, ఆఫీస్ సూపరింటెండెంట్ జగతి, టి. వనమాల, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, రిజర్వు ఇన్స్పెక్టర్ (ఎం.టీ.ఓ) ఎస్. శేఖర్ బాబు, (వెల్ఫేర్ / హోంగార్డ్స్) సతీష్, పదవి విరమణ చేసి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆరోపణల అధికారికి విదేశీ యోగమా?



డైట్ ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపించాలని అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

- ప్రిన్సిపాల్ జపాన్ పర్యటన రద్దు చేయాలి..
- వయోపరిమితి దాటినా ఎంపిక చేయడంపై పీడీఎస్‌యూ నేతల మండిపాటు...
- అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పణ

**నిజామాబాద్ సిటీ, ఆగస్టు 31 (బతుకమ్మ) :** నిజామాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌పై ఆర్థిక, పరిపాలనా అంశాలకు సంబంధించి ఫిర్యాదులు, ఆరోపణలు ఉన్న నేపథ్యం ఉండగా వయస్సు నిబంధనలను అతిక్రమించి ఆయనను జపాన్ విద్యా పర్యటనకు చేసిన ఎంపికను రద్దు చేయాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కర్క గణేష్ మాట్లాడుతూ డైట్ ప్రిన్సిపాల్‌పై సుమారు రూ.30 లక్షల నిధుల వినియోగానికి సంబంధించిన ఆరోపణలు, విద్యార్థులకు ఇబ్బందులు కలిగించారనే ఫిర్యాదులు తదితర అంశాలపై ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆరోపణలు వాస్తవమా కాదా అనేది సమగ్ర విచారణ, ఆర్థిక ఆడిట్ ద్వారా తేల్చాల్సి ఉందన్నారు. విచారణ పూర్తికాకముందే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిని జపాన్ విద్యా పర్యటనకు ఎంపిక చేయడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. జపాన్ విద్యా పర్యటనకు 55 సంవత్సరాలు లోపు ఉండాలని నిబంధనలో ఉండగా 60 సంవత్సరాలు ఉన్న డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ని ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. విద్యా పర్యటనల ఉద్దేశ్యం వ్యక్తిగత ప్రయోజనం కాదని, వాటి ద్వారా పొందే అనుభవం విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా వ్యవస్థకు దీర్ఘకాలికంగా ఉపయోగపడేలా ఉండాలన్నారు. ఎంపికలో నిబంధనల ఉల్లంఘనలు జరిగినాయని, ఎంపికను పునఃపరిశీలించి అర్హత కలిగిన సిబ్బందికి అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎంపిక ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, ప్రిన్సిపాల్‌పై ఉన్న ఆరోపణలపై సమగ్ర విచారణ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ జిల్లా సహాయ కార్యదర్శి అల్గోట్ సృజన్, నాయకులు శ్రీశాంత్,తదితరులు పాల్గొన్నారు.

# బాబాసాహెబ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి

- సుదర్శన్ నగర్ తండాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్

**భీంగల్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని, ఆయన చూపిన ప్రగతిశీల బాటలో నడవడమే మనం ఇచ్చే నిజమైన నివాళి అని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. భీంగల్ మండలం సుదర్శన్ నగర్ తండాలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం పండుగ వాతావరణంలో అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముత్యాల సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సం దర్భంగా ఏర్పాటు చేసిన సభలో సునీల్ కుమార్ మాట్లాడుతూ... విద్య ద్వారానే సామాజిక శ్రేయ స్సు, ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. సమాజంలో శతాబ్దాలుగా వేళ్లూ నుకున్న కులవివక్ష, అణచివేత, అసమాన తలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన మ హోన్నత వ్యక్తి బాబాసాహెబ్ అని కొనియాడారు.


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సునీల్ కుమార్

బాన్సువాడ ఎక్సైజ్ స్టేషన్‌లో నేడు

# వాహన బహిరంగ వేలం

**జప్తు చేసిన అశోక్ లేలాండ్ వాహనానికి ప్రారంభ ధర రూ.1.95 లక్షలు**

**రూ.48,750 ధరావత్తుతో వేలంలో పాల్గొనాలి**

**ఎక్సైజ్ సీఐ దిలీప్ కుమార్**



**బాన్సువాడ, ఆగస్టు 31 (బతుకమ్మ) :** బాన్సువాడ మధ్యనిషేధ మరియు అబ్కారీ (ఎక్సైజ్) స్టేషన్ పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాల కింద జప్తు చేసిన అశోక్ లేలాండ్ వాహనాన్ని సెప్టెంబర్ 1వ తేదీన బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఎక్సైజ్ సీఐ దిలీప్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు వేలానికి సంబంధించిన వివరాలను ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. వేలం పాటను ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని సీఐ దిలీప్ కుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు, వాహనదారులు మరియు ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వేలం వేసే వాహనాన్ని పరిశీలించాలనుకునే వారు బాన్సువాడ అబ్కారీ స్టేషన్ ప్రాంగణంలో ముందస్తుగా చూసుకోవచ్చని తెలిపారు. వేలం పాటలో అత్యధిక ధర ఖరారు చేసిన వారు నిబంధనల ప్రకారం వెంటనే మిగిలిన మొత్తాన్ని చెల్లించి వాహనాన్ని స్వంతం చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వివరాలకు అబ్కారీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.




# గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకుందాం

■ డీజేలకు అనుమతి లేదు!
■ విద్యుత్ తీగలు, విగ్రహాల ఎత్తుపై ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి..
■ కామారెడ్డి కళాభారతి ప్రాంగణంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశంలో ఎస్పీ రాజేష్ చంద్ర..





కామారెడ్డి కళాభారతి ప్రాంగణంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర

**కామారెడ్డి, ఆగస్టు 31 (బతుకమ్మ):** కామారెడ్డి జిల్లాలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, పిలుపునిచ్చారు. సోమవారం కళాభారతీ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది విగ్రహాల రవాణా సమయంలో విద్యుత్ తీగలు తగిలి జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి విగ్రహాల ఎత్తు, రవాణా విషయంలో కఠిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద దొంగతనాల నివారణకు సీసీటీవీ కెమెరాలు, రాత్రివేళల్లో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్ని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిపుణులతో ఏర్పాట్లు చేయించాలని స్పష్టం చేశారు. ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, మద్యం సేవించడం, అసభ్యకర కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలుపాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బాన్సువాడ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు లేకుండానే సిబ్బందితో ప్రజావాణి నిర్వహిస్తున్న దృశ్యం

## అధికారుల డుమ్మా

# 'ప్రజావాణి'పై అర్జీదారుల ఆగ్రహం

■ బాన్సువాడ ఎంపీడీవో కార్యాలయంలో అధికారుల స్థానంలో సిబ్బంది హాజరు..
■ సమస్యలు ఎవరికి చెప్పాలని ప్రజల మండిపాటు

**బాన్సువాడ, ఆగస్టు 31 (బతుకమ్మ):** ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరు కాకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారుల స్థానంలో సిబ్బంది మాత్రమే హాజరు కావడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎంతో ఆశతో వచ్చిన ప్రజలకు అధికారులు అందుబాటులో లేకపోవడంతో నిరాశకు గురయ్యారు. సమస్యలను స్వయంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు వస్తే సిబ్బందితోనే కార్యక్రమాన్ని నిర్వహించడం ఏమిటని మండిపడ్డారు. సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన అధికారులు ప్రజావాణికి తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శ్రావణ పూజలు

■ ఘనంగా అన్నసంతర్పణ
■ రుద్రూర్ దేవాలయంలో భక్తిశ్రద్ధలతో అర్చనలు
■ ప్రత్యే పూజల్లో విశేషంగా పాల్గొన్న భక్తులు..



అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టిన దాతలు, ఆలయ కమిటీ సభ్యులు

**రుద్రూర్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** శ్రావణమాసం సందర్భంగా రుద్రూర్ మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాతలు శ్రీధర్ గౌడ్, సంతోష్ గౌడ్ (రీతు), దేవ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, కటిక కళ్యాణ్, రమణ గౌడ్, జువ్వల శ్రావణ్, ధర్మారం వెంకట్, తాటిపాముల రాజశేఖర్, సందీప్, మధు, సతీష్ లు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాజేశ్వర్ అప్పు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



మాక్లూర్ మండలం గుంజిలి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

■ గుంజిలిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
■ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు
■ మాక్లూర్ కాంగ్రెస్ నాయకులు..

**మాక్లూర్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు హరీష్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం. నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని వారన్నారు. ప్రజా సమస్యల పరిష్కరమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, అదే విధంగా ప్రజా సంక్షేమమం కోసం వివిధ పథకాలు ప్రవేశపెట్టాందన్నారు. నియోజకవర్గ సమస్యల గురించి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ రెడ్డి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రజా అవసరాలకు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామా కాంగ్రెస్ పార్టీ అధ్యడు పాల్ద హరీష్, సుంకే గంగాధర్, చామంతుళ్ళ శ్రీనివాస్, సలీం, నవీన్, ఇస్మాయిల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మండల సమాఖ్య మహాజన సభలో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన పదాధికారులు, హాజరైన ఐకేపీ అధికారులు

## మండల సమాఖ్య కొత్త

# పదాధికారుల ఎన్నిక

రుద్రూర్‌లో ఐకేపీ సమాఖ్య మహాజన సభ
అధ్యక్షురాలిగా బి. రాధా, కార్యదర్శిగా గంగామణి

**రుద్రూర్, ఆగస్టు 31 (బతుకమ్మ):** రుద్రూర్ మండల కేంద్రంలోని ఐకేపి కార్యాలయంలో సమాఖ్య అధ్యక్షురాలు అధ్యక్షతన సోమవారం మహాజన సభ నిర్వహించారు. మండల సమాఖ్య పరిధిలోని అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాలు, కార్యదర్శి హాజరయ్యారు. గతంలో మండల సమాఖ్య నిర్వహణకు ఎన్నుకోబడిన పదాధికారులు పదవీకాలం ముగియడంతో కొత్తవారిని మండల సమైక్య మహాజనసభ ఏకగ్రీవ తీర్మానంతో ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షురాలుగా బి. రాధా సిద్దాపుర్ గ్రామ సంఘం, కార్యదర్శిరాలుగా గంగామణి రుద్రూర్ హనుమాన్ గ్రామ సంఘం, కోశాధికారిగా తబస్సుం బేగం గజ్జలవ్వ గ్రామ సంఘంలను ఏకగ్రీవంగా మహజనసభ తీర్మానంతో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సమైక్య మాజీ అధ్యక్షురాలు ద్రుపతి, ఏపీఎం బస్వంత్ రావ్, సీసీలు విఠల్, పూల్సింగ్, అకౌంటెంట్ సుద, పాల్గొన్నారు.

# వెంకంపల్లి వద్ద చిరుత కలకలం

## భయాందోళనలో గ్రామస్థులు

**నాగిరెడ్డిపేట, ఆగస్టు 31 (బతుకమ్మ) :** నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో చిరుతపులి ప్రత్యక్షం కావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం ఉదయం సత్యనారాయణ అనే రైతు తన పొలానికి వెళ్తున్న సమయంలో కొంత దూరంలో చిరుత కనిపించింది. దీంతో ఆందోళన చెందిన అతడు వెంటనే గ్రామానికి చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశాడు. ఊరి జనాలు అక్కడికి వెళ్లేసరికి చిరుత సమీపంలోని గుట్టపైకి వెళ్లిపోయింది. అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించగా, ఎఫ్ఆర్ఓ వాసుదేవ రావు ఆధ్వర్యంలో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. చిరుత సంచారంతో ఆందోళన చెందుతున్నామని, బోను ఏర్పాటు చేసి దాన్ని బంధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# పేదలు ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోండి

■ సర్కారు వైద్యం ఉత్తమం
■ సీఎంఆర్ఎఫ్ నిధుల పెంపునకు కృషి చేస్తా
■ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా..



**నిజామాబాద్ సిటీ,ఆగస్టు 31 (బతుకమ్మ):** ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ నిధులను కేవలం 20 శాతం మాత్రమే చెల్లిస్తున్నారని, వీటిని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న పేదలు తమ కార్యాలయంలో సంప్రదిస్తే ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేస్తామన్నారు. ఉత్తమ చికిత్స అందేలా చూస్తామన్నారు. అలాగే హైదరాబాదులోని బీబీనగర్ లో గల ఏయిమ్స్ లో అత్యాధునిక వైద్య సేవలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాగే నిమ్స్ లో చికిత్స పొందే వారికి తన ద్వారా ఎల్ఓసి అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా రెండు టిమ్స్ ఆసుపత్రులు నిర్మించారన్నారు. వారి సేవలను కూడా వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ లు మఠం పవన్, రాజేందర్,విజయ మల్లేష్ యాదవ్, కల్పే అర్చనా చిరంజీవి, సీనియర్ నాయకులు ఇప్పకాయల కిషోర్, మాస్టర్ శంకర్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరుబాట పట్టాలి




మాట్లాడుతున్న అఖిలభారత ఐక్యరైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్

- రైతంగ, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా పోరాడండి
- అఖిలభారత ఐక్యరైతు సంఘం ( ఏఐయుకెఎస్) రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్

**కమ్మర్ పల్లి, ఆగస్టు 31 (బతుకమ్మ):** కేంద్ర ప్రభుత్వం స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రైతు కార్మిక ప్రజలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ( ఏఐయుకెఎస్ ) రాష్ట్ర అధ్యక్షులు వి ప్రభాకర్ పిలుపునిచ్చారు. అమెరికా, బ్రిటన్, న్యూజిలాండ్ యూరోపియన్లతో కేంద్ర ప్రభుత్వం స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నద దీనికి వ్యతిరేకంగా దేశంలోని రైతులు, శ్రామిక ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర వ్యవసాయ, ఆర్థిక, సామాజిక సంక్షోభంపై సోమవారం కమ్మర్ పల్లి మండల కేంద్రం లో కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ముందు ఎర్రజెండాను అధ్యక్షులు ఎస్ సురేష్, ఎగరావేయగా, సభలో ముందుగా అమరవీరులకు రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీ సరిహ ద్దుల్లో జరిగిన చారిత్రాత్మక రైతు పోరాటం సందర్భంగా 2021 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం ఎంఎస్పి, రుణమాఫీ, విద్యుత్ ప్రైవే టీకరణ, రైతులపై కేసుల ఉపసంహరణపై ఇచ్చిన లిఖితపూర్వక హామీని అమలు చేయకపోవడంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో 385 రోజుల పాటు కొనసాగిన నిరంతర భారీ మహాపడావ్ పోరాటం రేయింబవళ్లు శాంతియుత ఉద్య మం జరిగిందన్నారు. ఆ ఉద్యమంలో 736 మంది అమరులయ్యారని అ అమరవీరుల ప్రాణత్యాగం నేపథ్యంలో 2020 నవంబర్ లో ఏర్పడినప్పటి నుండి, అన్ని పంటలకు సేకరణతో కూడిన చట్టబద్ధమైన జ2ం50% ఎంఎస్పి, గ్రామీణ రుణభారాన్ని, తత్ఫలితం గా జరుగుతున్న రైతులు, దినసరి కూలీల విస్తృత ఆత్మహత్యలను అంతం చేసేందుకు సమగ్ర రుణమాఫీ, విద్యుత్ ప్రైవేటీకరణను అడ్డుకోవడం అనే ప్రధాన డిమాండ్లను సాధించేందుకు ఏఐయుకెఎస్ పోరాట మార్గంలో అలుపెరగకుండా ఉద్యమం కొనసాగిందన్నారు. స్వాతంత్ర్యనంతరం జరిగిన అతి పెద్ద ప్రజా పోరాటమైన, శ్రామిక వర్గ ఉద్యమం నిర్వ్యా జన మద్దతుతో సాగిన ఈ రైతు పోరాటం 2021 నవంబర్ 19న 3 వ్యవసాయ చట్టాల రద్దును సాధించిందన్నారు . 2021 డిసెంబర్ 9 నాటి లిఖితపూర్వక హామీతో డిసెంబర్ 11న పోరాటాన్ని విరమించారని తెలిపారు. గత ఐదేళ్లలో ఎన్డీఏ నేతృత్వంలోని మోదీ ప్రభుత్వం ఏ హామీలను అమలు చేయలేదని, శ్రామిక ప్రజలపై పెరుగుతున్న కార్పొరేట్ దాడి గత 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గిట్టుబాటు ధర జ2ం50% ఫార్ములాకు చట్టబద్ధమైన హామీ కల్పిస్తామని 2014 బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాన్ని నిరాకరిస్తూ, పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించడానికి నిరాకరిస్తూ, పేద, మధ్యతరగతి రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు సంపూర్ణ కేంద్ర రుణమాఫీని నిరాకరిస్తూ, మొత్తం రైతాంగాన్ని నిరంతరం మోసం చేస్తూనే, రూ. 16 లక్షల కోట్ల కార్పొరేట్ బకాయిలను రద్దు చేసిందన్నారు. భారతదేశంలో అత్యల్ప సంపన్న వర్గాలకు, అత్యధిక సంఖ్యలో ఉన్న శ్రామిక ప్రజలకు మధ్య అసమానత పెరుగుతోందన్నారు 2026 ఆక్సాఫామ్ నివేదిక ప్రకారం, అత్యంత సంపన్నులైన 1 శాతం మంది 40 శాతం సంపదను కలిగి ఉండగా, పై స్థాయిలోని 10 శాతం మంది జాతీయ ఆదాయంలో 60 శాతం సంపాదిస్తున్నారన్నారు. అట్టడుగు 50 శాతం మంది జాతీయ ఆదాయంలో కేవలం 15 శాతం ఆదాయంతో జీవనం కొనసాగిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు జీ కిషన్, జిల్లా అధ్యక్షులు ఎస్ సురేష్, ప్రధానకార్యదర్శి బి బాబన్న, టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు కె రాజేశ్వర్, డివిజన్ అధ్యక్షులు బి కిషన్, ప్రధాన కార్యదర్శి ఆర్ దామోదర్, ఏఐయుకెఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జీ నడీపీ నర్సయ్య, ఆకుల గంగారాం, మండల నాయకులు పి రాజేశ్వర్, వి అశోక్, వి బాలయ్య, బి అశోక్ రాకేష్, విష్ణు, శివ తదితరులు పాల్గొన్నారు.



## అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

**భీమ్ గల్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** ఉద్యమకారుడు, బీయర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, భీమ్ గల్ మండల మాజీ జెడ్పీటీసీ చౌట్పల్లి తండ్రి అంత్యక్రియల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. భీమ్ గల్ జెడ్పిటీసీ తండ్రి సోమవారం కాలం చేయడంతో వారి అంత్యక్రియల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొని ఆయన పార్థివ దేహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం చౌట్పల్లి రవిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

## చెట్టును ఢీకొట్టిన బైక్ : ఒకరి మృతి

**మరో ప్రమాదంలో ఆరుగురికి గాయాలు**

**నాగిరెడ్డిపేట మండలంలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలు**

**తీవ్రంగా గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమం**

**నాగిరెడ్డిపేట, ఆగస్టు 31 (బతుకమ్మ) :** నాగిరెడ్డిపేట మండల పరిధిలో సోమవారం చోటుచేసుకున్న రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు ప్రాణాలు కోల్పోగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెద్దయ్యపల్లి శివారులో వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును బలమైన వేగంతో ఢీకొట్టింది. ఈ ఘటనలో మెదక్ జిల్లా కాట్రాల గ్రామానికి చెందిన కుమ్మరి లింగం (53) అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ భువనేశ్వర్ రావు తెలిపారు. మరొక ఘటనలో నాగిరెడ్డిపేట బంజారా తండా వద్ద జాతీయ రహదారిపై ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ సక్రంతో పాటు రవీందర్, నాన్విష్, అఖిల్, కమ్లి, శాంతిలక్ష్మిలు గాయపడ్డారు. ఎస్ఐ భార్గవ్ గౌడ్ క్షతగాత్రులను వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా రవీందర్, నాన్విష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## అర్జీల సత్వర పరిష్కారానికే 'ప్రజావాణి'

**అదనపు కలెక్టర్ విక్టర్ - జిల్లా కలెక్టరేట్‌లో 67 వినతుల స్వీకరణ**

**లింగంపేట మండలంలో అధికారుల గైర్హాజరీపై స్థానికుల నిరసన**

**లింగపేట, ఆగస్టు 31 (బతుకమ్మ):** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతోనే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ విక్టర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జెడ్పీ సీఈఓ చందర్‌తో కలిసి ప్రజల నుంచి 67 దరఖాస్తులను స్వీకరించారు. అందిన వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా, లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అధికారుల డుమ్మాతో నిస్తేజంగా మారింది. ఆర్అండ్‌బీ, తహశీల్దార్, ఎంఈఓ వంటి కీలక శాఖల అధికారులు రాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## నాగిరెడ్డిపేటలో
# కిలాడీ ముఠా దగా

**నగదు, వెండి అపహరణ**

**మత్తుమందు చల్లి రూ.20 వేల నగదు, 12 తులాల వెండి గొలుసుతో పరార్**

**సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసుల గాలింపు**

**నాగిరెడ్డిపేట, ఆగస్టు 31 (బతుకమ్మ) :** మాయమాటలు చెప్పి దంపతులను బురిడీ కొట్టించిన ముగ్గురు ముఠా సభ్యులు రూ. 20 వేల నగదు, 12 తులాల వెండి గొలుసుతో పరారైన ఘటన నాగిరెడ్డిపేటలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా పోచమ్మరాల్ తండాకు చెందిన కేస్లీ, సక్రియ దంపతులు వైద్యం కోసం నాగిరెడ్డిపేటలోని ప్రైవేట్ దవాఖానకు రాగా, ముగ్గురు అపరిచితులు వారిని వెంబడించారు. మాటల్లో దించి రూ. 10 నోటును నలిపి కేస్లీ చేతిలో పెట్టడంతో దంపతులు మత్తులోకి జారుకున్నారు. ఇదే అదునుగా భావించిన దొంగలు వారి వద్ద ఉన్న నగదు, వెండి గొలుసును దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ భార్గవ్ గౌడ్ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిజామాబాద్ సెంట్రల్ జైలు భద్రతపై సీపీ సాయిచైతన్య ప్రత్యేక సమీక్ష



జైలులో భద్రతను పరిశీలిస్తున్న సీపీ

- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశం
- సీసీ కెమెరాలు, ప్రహరీ గోడల భద్రత పరిశీలన

**నిజామాబాద్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** నిజామాబాద్ జిల్లా కేంద్ర కారాగారం భద్రతపై పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రత్యేక దృష్టి సారించారు. జైలులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతను పటిష్టం చేయాలని అధికారులను ఆదేశించారు. జైలు భద్రతా సమీక్ష సమావేశంలో పాల్గొన్న సీపీ, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, సీసీ కెమెరాల పనితీరు, ప్రహరీ గోడల బందోబస్తును స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం జైలు ఆస్పత్రి, డీ–అడిక్షన్ సెంటర్లను సందర్శించి ఖైదీలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. జైలు యంత్రాంగం, పోలీసు శాఖ పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ పి. అశోక్ కుమార్, డిప్యూటీ జైలర్ మన్మథరావు, జైలర్లు తిరుమలరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఐ ధరణి కుమార్, సాగ్రమాట్, ఎస్ఐ సందీప్ పాల్గొన్నారు.

## ఖండాంతరాలు దాటిన బంధం

- ఒక్కటైన 'కెనడా-నిజామాబాద్' జంట
- కెనడాలో చిగురించిన స్నేహం
- హిందూ సంప్రదాయబద్ధంగా పీటలెక్కిన తాటిపాముల సంజయ్ - సబ్రినా ఏమీస్పైన్



**నిజామాబాద్ సిటీ, ఆగస్టు 31 (బతుకమ్మ) :** "ప్రేమకు ప్రాంతీయ సరిహద్దులు, భాషా భేదాలు, సంస్కృతుల వ్యత్యాసాలు ఏవీ అడ్డంకి కావు" అని ఇందూరు వేదికగా జరిగిన ఒక అపూర్వ వివాహ మహోత్సవం నిరూపించింది. ఉన్నత చదువులు, ఉద్యోగ రీత్యా కెనడా వెళ్లిన నిజామాబాద్ యువకుడు, అక్కడి విదేశీ యువతితో ప్రేమలో పడి... ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో సంప్రదాయబద్ధంగా ఒక్కటయ్యారు. స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించిన ఈ ఖండాంతర కళ్యాణ వేడుక ప్రస్తుతం నిజామాబాద్ నగరంలో విశేష ప్రచారాన్ని పొందుతోంది. నిజామాబాద్ నగరానికి చెందిన తాటిపాముల సంజయ్ ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ నిమిత్తం కెనడాలో స్థిరపడ్డారు. ఈ క్రమంలోనే ఆయనకు కెనడాకు చెందిన సబ్రినా ఏమీస్పైన్‌తో పరిచయం ఏర్పడింది. ప్రారంభంలో సాధారణ స్నేహంగా మొదలైన వీరి అనుబంధం, కాలక్రమేణా ఒకరి ఆలోచనలు, వ్యక్తిత్వాలు మరొకరికి నచ్చడంతో గాఢమైన ప్రేమగా మారింది. భిన్న దేశాలు, వేర్వేరు సంస్కృతులకు చెందిన వారైనప్పటికీ, మనసులు కలవడంతో ఇద్దరూ దంపతులుగా మారాలని నిశ్చయించుకున్నారు. తమ ప్రేమ విషయాన్ని ఇరువైపుల కుటుంబ సభ్యులకు తెలియజేయగా, ఇరు కుటుంబాల పెద్దలు యువజంట నిం ్ణయాన్ని గౌరవించి వివాహానికి పచ్చజెండా ఊపారు. దీంతో పెళ్లి కొరకు కెనడా నుంచి వధువు సబ్రినాతో పాటు ఆమె కుటుంబ సభ్యులు, ఆప్తమిత్రులు నిజామాబాద్‌కు తరలివచ్చారు. ఆదివారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన శోభాయమానమైన కళ్యాణ వేదికపై హిందూ సంప్రదాయ పద్ధతిలో, మాంగళ్య ధారణ మరియు వేద మంత్రోచ్ఛారణల నడుమ సంజయ్–సబ్రినాలు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తెలుగు సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిపోయిన విదేశీ వధువు సబ్రినా, భారతీయ సంస్కృతి ప్రకారం జరిగిన ప్రతీ క్రతువులో ఉత్సాహంగా పాల్గొని సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకకు నగరంలోని బంధువులు, స్నేహితులు భారీ సంఖ్యలో హాజరై నూతన దంపతులపై అక్షతలు వేసి ఆశీం–్వదించారు. మనసులు కలిస్తే ఏ దేశమైనా, ఏ సంస్కృతియైనా ప్రేమకు హద్దులు కావని చాటిచెప్పిన ఈ జంటకు స్థానికులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు అందజేశారు.

## శిక్ష కాలం పూర్తిచేసుకొని
# సన్మార్గంలో జీవించాలి

**న్యాయమూర్తి నాగరాణి**

**కామారెడ్డి సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి**

**కామారెడ్డి, ఆగస్టు 31 (బతుకమ్మ) :** జైలు శిక్ష ముగిసిన తర్వాత ఖైదీలు నేర ప్రవృత్తిని వదిలి సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడపాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి టి.నాగరాణి హితవు పలికారు. రాష్ట్రన్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం ఆమె కామారెడ్డి సబ్‌జైలును సందర్శించి, పరిశీలించారు. జైలు వంటగది, పరిశుభ్రతతో పాటు లీగల్ ఎయిడ్ క్లినిక్ సేవలను తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం, బెయిల్, అప్పీలు మరియు లోక్ అదాలత్ గురించి వివరించారు. చట్టాలను పాటిస్తూ జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సెల్స్ మాయ సురేష్, శ్రీనివాస్ రావు, విట్టల్ రావు, జైలు సూపరింటెండెంట్ సీహెచ్. సంజీవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా యాప్ సమస్యకు మోక్షం

**హర్షం వ్యక్తం చేసిన రైతాంగం**

**ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి చొరవతో త్వరితగతిన పరిష్కారం**

**మంత్రి తుమ్మల, అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన రైతు సంఘం**

**ఆర్మూర్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** ఆర్మూర్ మున్సిపాలిటీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న యూరియా యాప్ సాంకేతిక సమస్య పరిష్కారం కావడం పట్ల ఆరు పంతాల రైతు సంఘం ఆనందం వ్యక్తం చేసింది. గత కొన్ని నెలలుగా యాప్ డౌన్‌లోడ్ కాక ఎరువుల కొనుగోలుకు తీవ్ర ఇబ్బందులు పడ్డామని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవియ, తహశీల్దార్ సత్యనారాయణలకు వివరించినట్లు తెలిపారు. రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు దృశ్యానికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. సమయానికి ఎరువులు అందుబాటులోకి తెచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులకు రైతు ప్రతినిధులు కలిగోట గంగాధర్, మగ్గిడి రాజేశ్వర్, బొల్లు పోతన్న, నారడి మల్లయ్య, దాబ్బలింగం భూపతిరెడ్డి, రవీందర్, ధన్యవాదాలు తెలిపారు.

## ఎల్లారెడ్డిలో జూద స్థావరంపై పోలీసుల దాడి

**ఎల్లారెడ్డి, ఆగస్టు 31 (బతుకమ్మ) :** చట్టవిరుద్ధంగా నడుస్తున్న గేమింగ్ స్థావరంపై ఎల్లారెడ్డి పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఒక గ్రామం గేటు సమీపంలో జూదం ఆడుతున్నారనే పక్కా సమాచారంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో జూదగాళ్ల వద్ద నుంచి రూ. 7,900 నగదు, 4 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. చట్టానికి వ్యతిరేకంగా జూదం ఆడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజు హెచ్చరించారు.

## తీహార్ జైలు జ్ఞాపకాలు

'నన్ను ఆడబిడ్డ అని చూడకుండా కర్కశంగా జైలుకు పంపారు. నేను తప్పు చేయలేదని మొదటి రోజే చెప్పా, సుప్రీంకోర్టు కూడా అదే తేల్చింది. దేశ చరిత్రలోనే తొలిసారి ఒక సీబీఐ ఆఫీసర్‌పైనే ఎంక్వైరీ వేయాలని కోర్టు ఆదేశించింది.'





## వేముల ప్రశాంత్ రెడ్డిపై ఫైర్

'కేసీఆర్ ఇంట్లో కూర్చొని తిని, ఆయనలా తయారవుదామని చూశాడు. గంజాయి డబ్బులతో ముక్కి మూలిగి గెలిచిన ప్రశాంత్ రెడ్డి ఇక రాజకీయాలు మర్చిపోవాల్సిందే. బాల్కొండ నుంచి పారిపోవాల్సిందే, నిన్ను వెంటపడి ఓడిస్తా.'

## ఎంపీ అర్వింద్‌పై నిప్పులు

'మాధవ్‌నగర్ బ్రిడ్జిని ఏడేళ్లుగా ఎందుకు కట్టించలేకపోయారు? ఏడేళ్లుగా అక్కడ గాడిదల పళ్లు తోముతున్నారా? అర్వింద్ పేరులోనే ధర్మం ఉంది, ఆయన చేసేవన్నీ అధర్మ పనులే.'





## 'పాంచజన్య' ఐదు హామీల

తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం, పేదలకు ఎకరం భూమి ఇచ్చే 'భూలక్ష్మి' పథకం, యువతకు 20 కోట్ల వరకు రుణాలు, పూర్తిస్థాయి సామాజిక న్యాయం అందిస్తామని స్పష్టం చేశారు.



# ఏ తప్పు చేయలేదు.. తలవంచేది లేదు..!



**నిజామాబాద్ , ఆగస్టు 31 (బతుకమ్మ) :** తెలంగాణ ఏర్పడి దశాబ్ద కాలం గడిచిన ప్రజల జీవనంలో ఎలాంటి పురోగతి లేదని పార్టీలు, ప్రభుత్వాలు మారుతున్నా ప్రయోజనం లేకపోవడంతో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తేవాలన్న సంకల్పంతో మీ ముందుకు వచ్చానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సోమవారం టీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్ లో పాంచజన్య మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ పార్టీ పెట్టిన 4 నెలల తర్వాత సొంతూరు నిజామాబాద్ గడ్డకు వచ్చి మిమ్మల్ని కలుసుకోవటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మనల్ని మనం పాలించుకోని మంచి చేసుకునేందుకు తెలంగాణ తెచ్చుకున్నామని,తెలంగాణ వచ్చాక కొంతమంచి జరిగిందని, కానీ ఇంకా జరగాల్సిన మంచి చాలా ఉందన్నారు. మనం తెలంగాణకు ఇంకా ఏం మంచి చేయాలన్న దానిపై మాట్లాడుకోవాల్సి ఉందని, తెలంగాణ వస్తే మన బతుకులు మారాతాయని ఊపిరిబిగపట్టి, పిడికిలెత్తి పోరాటం చేశామని, 1600 మంది బిడ్డల ప్రాణాలు ఆ పోరాటంలో పోయాయని అది మన బతుకు పోరాటమని గుర్తు చేశారు. కానీ తెలంగాణ వచ్చాక నిజంగా మన బతుకులు మారాయా అని ఒక్కసారి ఆలోచించాలన్నారు.

### బీఆర్ఎస్ ను టార్గెట్ చేసిన కవిత...

పదేళ్లు బీఆర్ఎస్ కు అధికారం ఇస్తే లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టారు. కానీ నిజామాబాద్ కు ఒక్క ఎకరానికి కూడా నీళ్లు రాలేదు. తెలంగాణ వచ్చాక కూడా మనకు మంచి జరగలేదు. అలాంటప్పుడు మనకు మంచి జరిగేందుకు కొత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. మన సమస్యలు పరిష్కారం కావాలంటే కొత్త శక్తి కావాల్సిన అవసరం ఉంది. నిజామాబాద్ కోడలిగా. మీ బిడ్డగా నన్ను 20 ఏళ్లుగా చూస్తున్నారు. నన్ను ఎంపీగా, ఎమ్మెల్సీగా గెలిపించారు. ఎక్కడకు పోయినా సరే మీ ధైర్యంతో నేను మాట్లాడుతా ఇవ్వాళ పదవుల కోసం కాకుండా ప్రజల కోసమే పార్టీ పెట్టాను. మళ్లీ నాకు మీరు ఆ ధైర్యం ఇవ్వాలి పదవుల కోసమే అంటే ఏ పార్టీకైనా నేను పోవచ్చు. కానీ ప్రజలకు మంచి చేయాలని పంతం పట్టి వస్తున్నా నేను చూడని పదవులు లేవు, నాకు పదవులు కావాల్సిన అవసరం లేదని కవిత అన్నారు.

### ఏం తప్పు చేశానని నన్ను తీహార్ జైల్లో పెట్టారు?

నన్ను అన్యాయంగా జైల్లో పెట్టారని అప్పుడు మాట్లాడిన నాయకులు ఆ తర్వాత ఎందుకు మౌనంగా ఉన్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 4 ఏళ్లు సీబీఐ, ఈడీ నన్ను ఎంత ఇబ్బంది పెట్టిన ధైర్యం సడలలేదని, దారి తప్పలేదని మీ నిజామాబాద్ బిడ్డ నిప్పు, నేను మొదటి రోజు నుంచి తప్పు చేయలేదని చెప్పానన్నారు. సుప్రీంకోర్టు కూడా అదే విషయాన్ని తేల్చింది. దేశంలో ఎప్పుడు లేని విధంగా సీబీఐ ఆఫీసర్ మీదనే ఎంక్వైరీ వేయాలని కోర్టు తీర్పు చెప్పిందన్నారు. ఆడబిడ్డ కష్టాల్లో ఉంటే అక్కున చేర్చుకోవాల్సింది పోయి కర్కశంగా నన్ను బయటకు పంపారని, నన్ను ఎందుకు తీసేశారో అర్థం కావటం లేదని, సొంతూరుకు రావటంతో ఆవేదనతో ఆపుకుందామనుకున్న కన్నీళ్లు వస్తున్నాయన్నారు. అలాగని నన్ను పిరికిదాన్ని అని మాత్రం అనుకోవద్దని, ఆడబిడ్డకు బాధ ఉంటే కన్నీళ్లు వస్తాయని తెలంగాణకు ఇంకా చాలా చేయాల్సి ఉందని, పదవుల కోసం కాకుండా పంతం పట్టి ఇందూరు గడ్డ వేదికగా మీ ముందుకు వస్తున్నానన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, పార్టీల ఎందుకు ప్రశ్నించడం లేదు

రాష్ట్రంలో ఇప్పటికే ఇన్ని పార్టీలు ఉండగా మళ్లీ కొత్తగా పార్టీ ఎందుకు అని మీకు అనిపించవచ్చునని, కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేపటితో వెయ్యి రోజులు అవుతుందన్నారు. ఇన్ని రోజుల్లో ఒక్క హామీ అయినా సరిగా అమలు చేసిందా అని ప్రశ్నించారు. రైతు భరోసా ఆగమైంది, రైతులు ఆగమయ్యారని ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. దొంగ హామీలతో గద్దెనెక్కిన వాళ్లను మనం నిలదీయాలా వద్దా? కాంగ్రెస్ పార్టీని నిలదీయాల్సి బీఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందని, నిజామాబాద్ జిల్లా వరకే చూస్తే కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎందుకు ప్రభుత్వాన్ని నిలదీయటం లేదని ప్రశ్నించారు. ప్రశాంత్ రెడ్డి, జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నింటం లేదని, ప్రతిపక్షం నిద్రపోతే మనం ఊరుకోవాలా ప్రజలకు తెలియజెప్పాల్సిందేనని అన్నారు.

### తండ్రి కూతురిని పాపటంలో వేముల ప్రశాంత్ రెడ్డిదే మొదటిపాత్ర

ప్రశాంత్ రెడ్డిని కేసీఆర్ పెద్ద కొడుకు మాదిరిగా ఆదరించి ఇంట్లో కూర్చో బెట్టుకోని ఎన్నోసార్లు భోజనం పెట్టారని, ప్రశాంత్ రెడ్డి కూడా కేసీఆర్ మాదిరిగా ఉండేందుకు ప్రయత్నిస్తాడు కానీ పులి చూసి నక్క వాతలు పెట్టుకుంటే కుదురుతుందా అన్నారు. తండ్రిని, కూతురును పాపటంలో ప్రశాంత్ రెడ్డిదే మొదటి పాత్ర అన్నారు. హరీష్ రావును, సంతోష్ రావు ను క్షమిస్తానేమో గానీ ప్రశాంత్ రెడ్డిని క్షమించనని, నా ఉసురు తప్పకుండా తాకుతుందని ఆక్రోశం వెల్లగక్కింది. బీఆర్ఎస్ ఓడిపోయిన రెండో రోజే కాంగ్రెస్ లోకి వెళ్లేందుకు ప్రశాంత్ రెడ్డి ప్రయత్నం చేసిందని, గంజాయి డబ్బులతో ముక్కి మూలిగి మూడు వేల ఓట్లతో గెలిచిండని ఎద్దేవా చేశారు. కానీ ఇక ప్రశాంత్ రెడ్డి రాజకీయాలు మర్చిపోవాలి, బాల్కొండ నుంచి పారిపోండి . .

మిమ్మల్ని వెంటబడి ఓడిస్తామని శపథం చేశారు. ప్రశాంత్ రెడ్డిని గెలిపించేందుకు నాకు ఆరోగ్యం బాగాలేకపోయిన కష్టపడ్డానని, ఆయనకు మంత్రి పదవి కూడా వచ్చిందని గుర్తు చేశారు. ఏం తక్కువైందని బీఆర్ఎస్ ఓడిపోయిన వెంటనే కాంగ్రెస్ కు వెళ్లాలని ప్రయత్నం చేసిందని ఆరోపణలు చేశారు. బాజిరెడ్డి గోవర్ధన్ ,జీవన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డిలను నేను గెలిపిస్తే వాళ్లే నన్ను ఓడించారని, వాళ్లంతా నన్ను ఓడించి మోసం చేస్తే కూడా నేను ఇంట్లో కూర్చోలేదని మీ కోసం కష్టపడేందుకు పార్టీ పెట్టానన్నారు. బీఆర్ఎస్ వాళ్లు పదేళ్లు దోచుకున్న డబ్బు ఇప్పటికీ లెక్కపెట్టుకుంటున్నారని,మా పార్టీలోకి వచ్చే వాళ్లను బెదిరిస్తున్నారంట. . . బెదిరిస్తే భయపడే రోజులు పోయినయ్ అని హెచ్చరించారు.

### నిజామాబాద్‌లో ఐదుకు ఐదు సీట్లు గెలిచి తీరుతాం..

ఐదు కీలక అంశాలతో తెలంగాణ రక్షణ సేన పార్టీ ముందుకు వెళుతుందని, శ్రీకృష్ణుడు చేతిలోని పాంచజన్య శంఖాన్ని మన ఐదు అంశాలకు పేరు పెట్టుకున్నామన్నారు. ఆధర్మం పెరిగిపోయినప్పుడు ధర్మాన్ని రక్షించేందుకు శ్రీకృష్ణుడు పాంచజన్యాన్ని పూరిస్తాడని. . శ్రీకృష్ణుడినిపాంచజన్యాన్ని నమ్ముకున్న వాళ్లు ఓడిపోయినట్లు చరిత్రలో లేదన్నారు. పేద మధ్యతరగతి వాళ్లు విద్య,?వైద్యం కోసమే పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నారని, ఇంట్లో ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే ఎంతో కష్టపడి కూడబెట్టుకున్న ఇళ్లు,బంగారం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.

మమ్మల్ని గెలిపిస్తే ఉచిత విద్య, వైద్యం అందిస్తానని హామీ ఇస్తున్నామని ఇవ్వన్నీ ఇవ్వటానికి డబ్బులు ఎక్కడివి అంటూ అబద్దాలు చెబుతారని మనకు 2 లక్షల కోట్ల ఆదాయం ఉందని, లక్ష కోట్ల రూపాయలు విద్య,?వైద్యం కోసం ఖర్చు చేయవచ్చున్నారు. అదే విధంగా యువతకు 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు వాళ్లు పరిశ్రమలు పెట్టుకునేందుకు లోన్లు ఇస్తామన్నారు. సామాజిక న్యాయం అంటే అన్ని రంగాల్లో అన్ని కులాల వాళ్లు ఉండాలి అందుకోసం మా పార్టీ పోరాటం చేస్తుందన్నారు. భూమి లేక అర్హత ఉన్న పేదలకు కూడా ఎకరం భూమి ఇస్తామని, భూమి అనేది పేదవాళ్లకు ఒక గౌరవం, అందుకే భూలక్ష్మి పథకం ద్వారా ఎకరం భూమి ఇస్తామన్నారు.

### హైడ్రా తరహాలో నిజామాబాద్‌లో నిడ్రా పెట్టి ఆగం చేస్తారట...

పేదలకు భూములు ఇవ్వాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం అసైన్డ్ భూములను లాక్కుంటుంది. హైదరాబాద్ లో హైడ్రా పేరుతో భయపడుతున్నది చాలక నిజామాబాద్ లో నిడ్రా అని పెట్టి పేదలను ఆగం చేస్తారంటా. కానీ 12 ఏళ్లలో పెన్షన్ పెంచలేదని, కొత్త వాళ్లకు పెన్షన్ ఇవ్వలేదన్నారు. బోధన షుగర్ ఫ్యాక్టరీ తెరిపించేందుకు ఎంతో కృషి చేసినప్పటికీ కేసీఆర్ దాన్ని తెరవలేదని, షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు 18 కోట్లు ఇవ్వాలంటే కేటీఆర్ ఇవ్వలేదన్నారు. కేటీఆర్ దోస్త్ కోరుట్ల ఎమ్మెల్యే కోసమే షుగర్ ఫ్యాక్టరీ తెరవలేదని తర్వాత తెలిసిందన్నారు.

### ఎంపీ అర్వింద్ నువ్వేమి ట్యాక్స్ తీసుకుంటున్నావు . .

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మాధవ్ నగర్ బ్రిడ్జిని ఏడేళ్లుగా ఎందుకు కట్టించలేకపోతున్నారని, నేను ఎంపీగా ఉన్నప్పుడు ఇదే బ్రిడ్జి నిర్మాణం పూర్తికాకపోతే కేకే ట్యాక్స్ అన్నావ్ అని ఆరోపణ చేశారు. మరి ఏడేళ్లుగా నువ్వు ఎందుకు బ్రిడ్జి పనులు పూర్తి చేయలేదని,నువ్వేం ట్యాక్స్ తీసుకుంటున్నావ్, ఏడేళ్లుగా గాడిదల పళ్లు తోముతున్నావా అని ప్రశ్నిస్తున్నానన్నారు. ధర్మపురి అర్వింద్ పేరులోనే ధర్మం ఉంది కానీ ఆయనలో మొత్తం అధర్మమే అన్నారు. ఆయన తెచ్చానని చెప్పుకుంటున్న పసుపు బోర్డు ద్వారా రైతులకు పైసా ప్రయోజనం లేదని, ప్రశ్నిస్తే అడ్డగోలుగా మాట్లాడటం తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఈ అర్వింద్, ప్రశాంత్ రెడ్డి లు కాంగ్రెస్‌లోకి పోదామని అనుకుంటున్నారంట. అర్వింద్ కేసీ వేణుగోపాల్ ను కూడా కలిశాడంట, ప్రజల కోసం పార్టీలు మారితే ఓకే కానీ పదవుల కోసం మారేవాళ్లను సహిద్దామా అని ప్రశ్నించారు. చాలా మంది మా పార్టీలో పెద్ద నాయకులు లేరని అంటున్నారు. పెద్ద నాయకులున్న బీఆర్ఎస్ ను ఇంటికి తోలలేదా అని,మేము చిన్న నాయకులమైనా పర్వాలేదని ప్రజల కోసం పనిచేస్తామన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అవకాసం ఇస్తే అదే జీవన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గణేష్ గుప్తా లే కదా టికెట్లు ఇస్తారని ప్రశ్నించారు. వాళ్ల కన్నా కూడా మా పార్టీలో ఉండే కొత్త యువ నాయకత్వానికి అవకాశం ఇవ్వండి, మేము ప్రతి నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేలను తయారు చేస్తామని, నిజామాబాద్‌లో భూపతి రెడ్డి, సూర్య నారాయణ గుప్తా, సుదర్శన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి లాంటి అక్రమాలు చేస్తున్న వాళ్ల వెంట పడుతామన్నారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని కవిత అన్నారు.

# మూసీపై అందుబాటులోకి మరో వంతెన

- మూసీ నదిపై నిర్మించిన ముసారాంబాగ్ హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభించిన సముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రూ. 52 కోట్లతో 400 మీటర్ల బ్రిడ్జి నిర్మాణం..
- హాజరైన పలువురు ప్రజాప్రతినిధులు




**హైదరాబాద్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** హైదరాబాద్ మూసీ నదిపై అంబర్‌పేట నుంచి దిల్‌సుఖ్‌నగర్ మార్గంలో కొత్తగా నిర్మించిన ముసారాంబాగ్ హై లెవల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సోమవారం ప్రజాప్రతినిధులతో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జికి సంబంధించి అధికారులు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. 400 మీటర్ల పొడవైన ముసారాంబాగ్ బ్రిడ్జిని రూ. 52 కోట్లతో నిర్మించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వీ హనుమంత రావు , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , అసదుద్దీన్ ఓవైసీ , శాసనసభ్యులు కాలేరు వెంకటేష్ , మల్‌రెడ్డి రంగారెడ్డి , శ్రీగణేష్ , నవీన్ యాదవ్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## కొండా సురేఖ
# బీజేపీలోకి వస్తే స్వాగతిస్తాం

- ఎంపీ ధర్మపురి అరవింద్
- ఆమెపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు..
- తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చ

**హైదరాబాద్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** తెలంగాణ మంత్రి కొండా సురేఖ బీజేపీలోకి వస్తే తాము స్వాగతిస్తామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఆమెపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకపోవడంతో.. ఆమె బీజేపీలో చేరడాన్ని ఎవరూ వ్యతిరేకించడం లేదని పేర్కొన్నారు. కొండా సురేఖ బీజేపీలో చేరే అంశంపై స్పందించిన ధర్మపురి అ-రవింద్.. పార్టీలోకి వచ్చే వారిని స్వాగతించే విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా సురేఖపై అవినీతికి సంబంధించిన ఆరోపణలు లేవని ఆయన వ్యాఖ్యానించారు. అవినీతి మరకలు లేని నాయకులు బీజేపీలోకి వస్తే పార్టీలో ఎలాంటి వ్యతిరేకత ఉండదని అరవింద్ పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మంత్రి కొండా సురేఖ భవిష్యత్ రాజకీయ అడుగులపై ఇప్పటికే పలు ఊహాగానాలు వినిపిస్తున్న నేపథ్యంలో అ-రవింద్ వ్యాఖ్యలకు తీవ్ర ప్రాధాన్యత ఏర్పడింది.

## రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్
# కుట్ర పూరిత రాజకీయం

- వివక్షను ప్రశ్నిస్తే కేసులు పెడతారా?
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** దళితులపై జరుగుతున్న వివక్ష, అంటరానితనం, సామాజిక అన్యాయాలకు వ్యతిరేకంగా గళం వినిపించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం బీజేపీ కక్షపూరిత రాజకీయ కుట్రకు నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఎదుర్కొన్న అవమానకర పరిస్థితులపై రాహుల్ గాంధీ ప్రశ్నిస్తే, సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ప్రశ్నించిన రాహుల్ గాంధీపైనే కేసులు నమోదు చేయడం దురదృష్టకరమని అన్నారు. దళితులపై వివక్ష, అంటరానితనాన్ని ప్రశ్నించడం నేరమా అని ఆయన ప్రశ్నించారు. అన్యాయాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం ద్వారా అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించలేరని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన ప్రభుత్వం.. అన్యాయాన్ని ప్రశ్నించిన వారినే నిందితులుగా చిత్రీకరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. అంటరానితనాన్ని రాజ్యాంగం ద్వారా నిర్మూలించడం నుంచి ఎస్సీ, ఎస్టీలపై అఘాయిత్యాలను నిరోధించేందుకు ప్రత్యేక చట్టాల రూపకల్పన వరకు సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దళితులపై వివక్షను నిర్మూలించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న నిర్దిష్ట చర్యలేమిటో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంటరానితనం నిర్మూలన కోసం ఆర్ఎస్ఎస్ చేపట్టిన ఉద్యమాలు, చేసిన పోరాటాలేమిటో కూడా ప్రజలకు వివరించాలని సవాల్ చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలైన సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దళితుల హక్కులు,ఆత్మగౌరవం కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కుల వివక్ష, అంటరానితనం, సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.



# ప్రభుత్వాస్పత్రుల్లో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను విస్తరించాలి

**ప్రయివేటు ఫర్టిలిటీ సెంటర్లలో ఏఆర్‌టీ, సరోగసీ చట్టాలను కట్టుదిట్టం చేయాలి**

**సమీక్షలో అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర రాజనర్సింహ**

**హైదరాబాద్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సేవలను మరింత విస్తరించడంతో పాటు ప్రయివేటు ఫర్టిలిటీ సెంటర్లలో ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలును కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడే సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఫర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్ల పనితీరు, ఏఆర్‌టీ, సరోగసి చట్టాల అమలు, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలుపై సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గాంధీ, పేట్లబుర్జు ఆస్పత్రుల్లోని ఐవీఎఫ్ సెంటర్లలో 39,802 మంది పేషెంట్లకు ఫర్టిలిటీ వైద్య సేవలు అందించామనీ, 20,185 ఫాలిక్యులర్ స్టడీలు, 521 ఐయూఐ ప్రక్రియలు, 545 ఐవీఎఫ్ కేసులు చేశామని అధికారులు వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 477 ఏఆర్‌టీ, సరోగసి సెంటర్లు రిజిస్టర్ అయి ఉన్నాయని తెలిపారు. వాటిలో 129 ఏఆర్‌టీ లెవల్-1, 226 ఏఆర్‌టీ లెవల్-2, 59 ఏఆర్‌టీ బ్యాంకులు, 63 సరోగసి క్లినిక్‌లు ఉన్నాయనీ, ఇప్పటివరకు 379 సెంటర్లను తనిఖీ చేయగా, 50 సెంటర్లలో డీవియేషన్స్ గుర్తించినట్లు హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యానారాయణ మంత్రికి వివరించారు. ఆయా సెంటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామనీ, రెండు సెంటర్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేసి మరో తొమ్మిది సెంటర్ల అనుమతులను తాత్కాలికంగా రద్దు చేశామని కమిషనర్ వెల్లడించారు. ఫర్టిలిటీ సేవల పేరుతో పేషెంట్లపై అనవసర ఆర్థిక భారం మోపకుండా, పారదర్శకతతో సేవలు అందేలా చూడాలని మంత్రి రాజనర్సింహ సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, ఐవీఎఫ్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుమిత్ర, తదితరులు పాల్గొన్నారు.



# సీడ్ గణపతిని పూజిద్దాం.. ప్రకృతిని కాపాడుకుందాం

- విగ్రహం కరిగి మొక్కగా మారే వినాయకుడు
- 'సీడ్ గణేషా' ఆవిష్కరించిన మెగాస్టార్ చిరంజీవి



గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపొందించిన 'సీడ్ గణేషా' మట్టి విగ్రహాలను మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌తో కలిసి ఆవిష్కరిస్తున్న మెగాస్టార్ చిరంజీవి

**హైదరబాద్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** ప్రకృతి సంరక్షణ కోసం పచ్చదనం పెంపుకోసం ఈ సారి అందరూ సీడ్ గణేశుడిని పూజించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణేశుడిని పూజించి ఆ తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేయడం వల్ల.. వినాయకుడు మొక్కై ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తాడని తెలిపారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపొందించిన సీడ్ గణేశా ప్రతిమలను చిరంజీవి ఆదివారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను ఓ యజ్ఞం లా భావించి ఇప్పటికే 20 కోట్ల మొక్కలు నాటేలా లక్షల మందిని ప్రోత్సహించిన సంతోష్ ..అభినందనీయుడని ఆయన దీక్షకు తమ వంతు తోడ్పాటు ఉంటుందని ప్రశంసించారు.

**ఆశీస్సులతో పాటు ఆరోగ్యాన్ని అందించాలి.**

సీడ్ గణేశుడిని ఆరాధించడం ద్వారా అటు పుణ్యం..ఇటు పురుషార్థం(ప్రకృతిని కాపాడే బాధ్యత) దక్కుతుందని చిరంజీవి ఈ సందర్భంగా చెప్పారు. "వినాయక చవితి వచ్చిందంటే ఊరూ వాడా వేడుకలే వేడుకలు. అయితే ఇటీవల పోటీ బాగా పెరిగిపోయి.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసే విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీళ్లు కలుషితమవుతున్నాయి. పండుగతో అందరికీ ఆరోగ్యం అందాలి. భగవంతుడి ఆశీస్సులందాలి. ఈ నేపథ్యంలోనే సోదర సమానుడైన సంతోష్.. ఈ సీడ్ గణేశాను అందుబాటులోకి తెచ్చారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ ను దీక్షలా ముందుకు తీసుకెళుతున్న సంతోష్.. వినాయకుడి పూజకు విత్తనంతో కలిసి ఉన్న ప్రతిమను అందిస్తున్నారు. పూజ ముగిసిన తర్వాత ఇంట్లోనే నిమజ్జనం చేస్తే.. దేవుడే మొక్కగా మారి ఆశీర్వదిస్తాడు. సీడ్ మొక్కగా మారడంతో.. మనం అటు వినాయకుడుని పూజించినట్లవుతుంది. ఇటు మొక్కలను నాటిన బాధ్యత పూర్తయినట్టు ఉంటుందన్నారు.

**దేవుడే..వృక్షమైతే..**

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల చెరువులు, నదులు తీవ్రంగా కలుషితం అవుతున్నాయి. వీటికి చెక్ పెడుతూ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆలోచనల నుంచి పుట్టిందే ఈ వినూత్న వినాయకుడు. పూర్తిగా సహజమైన మట్టి, కోకోపీట్ , కొబ్బరి పొడితో ఈ విగ్రహాలను తయారు చేస్తారు. వీటి లోపల వేప, చింత లాంటి దేశీయ వృక్షాల విత్తనాలను ఉంచుతారు. నవరాత్రుల పూజల తర్వాత భక్తులు ఈ విగ్రహాన్ని ఏదైనా కుండలో లేదా పెరట్లోని మట్టిలో ఉంచి నీళ్లు పోస్తే చాలు. విగ్రహం కరిగిపోయి.. అందులోని విత్తనాలు మొలకెత్తి పచ్చని మొక్కగా ఎదుగుతాయి. ఇంట్లోనే ఒక వృక్షంలా శాశ్వతంగా ఉండిపోతాడన్నమాట అని అన్నారు. ఈ 'సీడ్ గణేషా' ప్రయాణం 2020లో కోవిడ్ సంక్షోభ సమయంలో అప్పటి అటవీ శాఖ మంత్రి ఎ. ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. 1.5 లక్షల విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. 2023లో కూకట్‌పల్లి నెక్సస్ మాల్‌లో చైల్డ్ ఆర్టిస్ట్ ధృవన్ చేతుల మీదుగా పిల్లల్లో అవేర్‌నెస్ తీసుకొచ్చారు. 2025లో స్వర్ణగిరి టెంపుల్‌లో యాక్టర్ నారా రోహిత్ సమక్షంలో ఏకంగా 5 లక్షల విగ్రహాల పంపిణీ లక్ష్యంగా భారీ కార్యక్రమం జరిగింది. తాజాగా 2026 సీజన్ కోసం మెగాస్టార్ చిరంజీవి దీన్ని ఆవిష్కరించి మరింత మందికి చేరువ చేశారు.

MOVIE TIME
మంగళవారం | 1 సెప్టెంబర్ | 2026

బతుకమ్మ

# రెండు పాత్రల్లో చిరు

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ సినిమాగా రూపొందుతున్న ఈ మూవీ అప్‌డేట్ కోసం మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో చిరు పోషించే పాత్రలపై ఓ క్రేజీ వార్త వినిపిస్తోంది. ఆయన రెండు విభిన్న పాత్రల్లో కనిపించనున్నారట. ఇందులో ఒక పాత్రలో చిరంజీవి చాలా యంగ్ లుక్‌లో కనిపించడంతో పాటు, ఇప్పటివరకు చూడని కొత్త అవతార్‌లో అలరించనున్నారని సమాచారం. మరో పాత్రలో మాత్రం రెగ్యులర్ లుక్‌లో కనిపిస్తారట. రెండు పాత్రల్లోనూ విభిన్నమైన వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తోంది. ఫ్యామిలీ ఎమోషన్స్ కు ప్రాధాన్యతనిస్తూ బాబీ ఈ కథను ప్రత్యేకంగా తెరకెక్కిస్తున్నారట. KVN ప్రొడక్షన్స్ పై వెంకట్ కె. నారాయణ, లోహిత్ నిర్మిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్నారు.



# హ్యాపీ 20 జీజీ

సూపర్ స్టార్ మహేష్ బాబు తన తనయుడు గౌతమ్ ఘట్టమనేని 20వ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. గౌతమ్‌తో కలిసి నడుస్తున్న అందమైన ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ భావోద్వేగ సందేశాన్ని రాసుకొచ్చారు. "హ్యాపీ 20 జీజీ. జీవితంలో కొత్త అధ్యాయంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నీ కలలను ధైర్యంతో, దయతో సాకారం చేసుకోవాలని కోరుకుంటున్నాను. ఈ రోజే కాదు.. ప్రతి రోజూ నీ గురించి ఎంతో గర్వపడుతుంటాను" అని మహేష్ పేర్కొన్నారు. పచ్చని ప్రకృతి నడుమ తండ్రీకొడుకులు కలిసి నడుస్తున్న ఈ ఫొటో అభిమానులను ఆకట్టుకుంటోంది. గౌతమ్ 20వ వసంతంలోకి అడుగుపెట్టడంతో ఘట్టమనేని అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు.






# మరో సెలబ్రిటీ జంట..

టాలీవుడ్‌లో మరో సెలబ్రిటీ జంట తమ రిలేషన్‌షిప్‌పై క్లారిటీ ఇచ్చింది. 'బలగం' ఫేమ్ నటి కావ్య కళ్యాణ్‌రామ్, ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం. కీరవాణి తనయుడు, మ్యూజిక్ డైరెక్టర్ కాలభైరవతో ప్రేమలో ఉన్నట్లు అధికారికంగా వెల్లడించింది. గత కొంతకాలంగా వీరిద్దరి రిలేషన్‌పై వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ, కాలభైరవతో కలిసి ఉన్న అందమైన ఫొటోలను కావ్య ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. తన జీవితంలోకి కాలభైరవ వచ్చిన తర్వాత ప్రతి క్షణం ప్రత్యేకంగా మారిందంటూ భావోద్వేగ నోట్‌ను జత చేసింది. ఈ పోస్ట్ పై అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇక వీరి పెళ్లి ఎప్పుడు జరుగుతుందోనని అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.



# సెప్టెంబర్ 6న బిగ్ అప్ డేట్

గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ హీరోగా తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమాను NBK111 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్నారు. యంగ్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తుండటంతో బాలయ్య నుంచి మరో పవర్‌ఫుల్ మాస్ ఫీస్ట్ ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ క్రేజీ కాంబినేషన్‌పై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో మూవీ టీమ్ తాజాగా ఓ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చింది. సెప్టెంబర్ 6న సినిమాకు సంబంధించిన కీలక ప్రకటన ఉంటుందని మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. అదే రోజున మూవీ టైటిల్‌తో పాటు రిలీజ్ డేట్‌ను కూడా ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో బాలయ్య అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. కాగా, ఈ సినిమాను డిసెంబర్ 24, 2026న క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.



బీడీ కార్మికుల సమస్యలపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నేతలు

బీడీ కార్మికులకు రూ.4,000

## జీవన భృతి ఇవ్వాల్సిందే

**నెలకు 26 రోజుల పని కల్పించాలి**

**ఈ నెల 4, 7 తేదీల్లో మండల కేంద్రాల్లో ధర్నాలకు సీఐటీయూ పిలుపు**

**ధర్పల్లి, ఆగస్టు 31 (బతుకమ్మ) :** బీడీ కార్మికుల జీవన భృతిని 4వేల రూపాయలకు పెంచాలని, కొత్తగా దరఖాస్తులు చేసుకోవటానికి అర్హులైన కార్మికులను దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని, బీడీ కార్మికులకు నెలకు 26 రోజుల పని కల్పించాలని బీడీ కార్మికుల ఆందోళనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు పిలుపు నిచ్చారు. సోమవారం ధర్పల్లి మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకుపిలుపునివ్వడం జరిగిందని. తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర మహాసభలు నిన్న సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగాయని ఈ మహాసభలో బీడీ కార్మికుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయడం జరిగిందని అన్నారు. అందులో అందులో భాగంగా ఈనెల 4న ఇందల్వాయి మండల కేంద్రంలో 7న ధర్పల్లి మండల కేంద్రంలో బీడీ కార్మికుల ధర్నాలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం జరిగే ఆందోళనలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. మహాసభల్లో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గంగ మోహన్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా నాయక్ వాడి రమ, శంకర్ గౌడ్, నన్నేసాబ్, రమేష్ బాబు తదితరులను ఎన్నుకున్నారు. నూతన రాష్ట్ర కమిటీ కార్మికుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో బీడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగా మోహన్ పాల్గొన్నారు.

**శేష జీవితం సమాజ సేవకే**

## అంకితం చేయాలి

**వేల్పూర్ ఎంపీడీవో బాలకిషన్ పదవీ విరమణ సభలో సన్మానించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**

**వేల్పూర్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** ఉద్యోగం చేస్తూ ఎందరికో మంచి చేసి, తను చేస్తున్న వృత్తిలో అందరి మన్ననలను పొంది పదవి విరమణ చేస్తున్న మీరు శేష జీవితం సమాజ సేవలో గడపాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. వేల్పూర్ మండలంలో మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ గా పని చేసి పదవి విరమణ పొందిన వెలిచాల బాలకిషన్ పదవి విరమణ కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాలకిషన్ పూలమాల, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా నిత్యం ప్రజలతో శత్ సంబదాలు కలిగి ఉన్న మీరు భవిష్యత్ లో కుటుంబానికి సమయాన్ని కేటాయిస్తూ, అ వసరమచ్చినపుడు సమాజ సేవకు సమయం ఇబవాలన్నారు. పదవీ విరమణ మనం చేస్తున్న ఉద్యోగానికే గాని మనకు కాదన్నారు.



బాలకిషన్‌ను శాలువా, పూలమాలతో సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

# అంబేడ్కర్‌పై దుష్ప్రచారం సహించేది లేదు

- అమర ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి
- డీజీపీ కార్యాలయంలో బహుజన సంఘాల ఫిర్యాదు
- 'కల్పిత నాయకుడు' పుస్తకంపై విచారణకు డిమాండ్

**నిజామాబాద్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వ్యక్తిత్వం, జీవితం, ఆలోచనా విధానం రాజ్యాంగ నిర్మాణంపై దురుద్దేశపూర్వకంగా సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం, అసత్య కథనాలు ప్రచారం చేస్తున్న అమర ప్రసాద్ అనే వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిజిపి కార్యలయంలో పిర్యాదు చేశారు. బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర నాయకులు దేవతి శ్రీనివాస్, ఎస్సీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు తీగల అశోక్ కుమార్, బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడిమర్రి రాజశేఖర్ లు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి కి పిర్యాదు చేశారు. ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ.. హమారా ప్రసాద్ అనే వ్యక్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి తప్పుడు నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయడంతో పాటు, "కల్పిత నాయకుడు" అనే పుస్తకాన్ని ప్రచురించి త్వరలో విడుదల చేస్తానంటూ సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారని ఐజీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా అసత్య ప్రచారం చేయడం సమాజంలో అపోహలు, విద్వేషాలు మరియు అశాంతికి దారితీసే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, వాస్తవాలను పరిశీలించి, చట్టపరంగా నేరం నిర్ధారణ అయితే హమార ప్రసాద్ పై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ని కోరమన్నారు.



ఐజీ చంద్రశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బహుజన సంక్షేమ సంఘాల నాయకులు

లింగంపేటలో 'ప్రజావాణి'కి

## అధికారుల డుమ్మా



**లింగంపేట, ఆగస్టు 31 (బతుకమ్మ):** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన, నేరుగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమం పట్ల మండల స్థాయి అధికారులు తీవ్ర అలసత్వం వహిస్తున్నారు. సోమవారం లింగంపేట మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ వినతుల స్వీకరణ కార్యక్రమానికి పలు శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజావాణి కాస్త నామమాత్రంగా మారింది. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ, లింగంపేటలో అధికారుల తీరు ఏమాత్రం మారలేదు. సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం ఉదయాన్నే వచ్చిన అర్జిదారులకు అధికారుల సీట్లలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. అధికారులు గంటన్నర ఆలస్యంగా రావడం లేదా తమ స్థానంలో కిందిస్థాయి సిబ్బందిని పంపి మమ అనిపించడంపై స్థానికులు, ఆర్జీదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజావాణి విధులకు డుమ్మా కొట్టిన అధికారులపై కలెక్టర్ తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాసంఘాల డిమాండ్ చేస్తున్నారు.

బాన్సువాడలో ఓటర్లకు

## 'ఎస్ఐఆర్' నోటీసుల తాకిడి

**బాన్సువాడ, ఆగస్టు 31 (బతుకమ్మ) :** కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బాన్సువాడ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అత్యంత వేగంగా సాగుతోంది. అయితే ఈ ప్రక్రియలో భాగంగా అధికారుల నుంచి అందుతున్న నోటీసులతో స్థానిక ఓటర్లలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన ప్రాథమిక పరిశీలనలో ఇప్పటికే 19 వేలకు పైగా ఓట్లు తొలిగిపోగా, ఒక్క బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోనే ఓటర్లకు భారీగా నోటీసులు జారీ కావడం చర్చనీయాంశంగా మారింది. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మొత్తం 24 వేల ఓట్లకు గాను ఏకంగా 7,592 మంది ఓటర్లకు అధికారులు నోటీసులు అందజేశారు. 2002 నాటి ఓటర్ల జాబితా వివరాలు, నివేదికలతో ప్రస్తుత డేటా సరిపోలకపోవడం, పేర్లు, తండ్రి లేదా భర్త పేర్లలో అక్షర దోషాలు ఉండటం, చిరునామాల్లో తేడాలు నమోదు కావడమే ఈ నోటీసులకు ప్రధాన కారణమని అధికారులు చెబుతున్నారు. దీంతో దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వారు కూడా నోటీసులు చూసి దిగ్భ్రాంతికి గురవుతున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని, నిర్ణీత గడువు సమయంలోగా తమ సరైన ఆధారాలను సమర్పించాల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ స్పష్టం చేశారు.





వ్యాపార సముదాయాల్లో దాడులు నిర్వహించి, నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై

## అధికారుల ఉక్కుపాదం

**ఆర్మూర్‌లో మెరుపు దాడులు**

**చైర్‌పర్సన్ గోనె లహరి రఘు, కమిషనర్ శ్రీహరి రాజు ఆదేశాలతో మున్సిపల్ అధికారుల చర్యలు**

**పలు వ్యాపార సముదాయాల్లో నిషేధిత ప్లాస్టిక్ సీజ్**

**ఆర్మూర్ పట్టణాన్ని పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ రహితంగా మార్చడమే లక్ష్యం**

**ఆర్మూర్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** ఆర్మూర్ పట్టణంలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు, వాడకంపై పురపాలక అధికారులు సోమవారం తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జిల్లా కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి రఘు, కమిషనర్ శ్రీహరి రాజుల ఆదేశాలు మరియు సూచనల మేరకు పురపాలక శాఖ ప్రత్యేక బృందాలు పట్టణంలో విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టాయి. పట్టణంలోని ప్రధాన వ్యాపార వీధులు, మార్కెట్ ప్రాంతాలు, కిరాణా మరియు హోల్‌సేల్ వ్యాపార సముదాయాలపై అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీ పరిమాణంలో లభించిన నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, కప్పులు, స్పూన్లు, ప్లేట్లను అధికారులు తక్షణమే స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ప్లాస్టిక్ విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులకు అక్కడికక్కడే భారీగా జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికే కాకుండా ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్మూర్ పట్టణాన్ని పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఇకపై కూడా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, ఎవరైనా మళ్లీ ప్లాస్టిక్ విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు, పట్టణ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానివేసి, పర్యావరణ హితమైన కాగితపు, గుడ్డ సంచులను మాత్రమే ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్

**బాల్కొండ, ఆగస్టు 31 (బతుకమ్మ) :** దొరికిన రూ. వేల విలువైన సెల్‌ఫోన్‌ను స్థానిక పోలీసులకు అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు ఒక ఆటో డ్రైవర్. బాల్కొండ మండలం వన్నెల్ (బి) గ్రామానికి చెందిన సయ్యద్ ఇస్మాయిల్ ఆదివారం రాత్రి ఆర్మూర్ నుంచి బాల్కొండకు వెళ్తుండగా చిట్టాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డు పక్కన పడివున్న ఒక సెల్‌ఫోన్ లభించింది. ఆ ఫోన్‌ను సోమవారం ఉదయం బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కే. శైలేందర్‌కు అందజేశాడు. ఇస్మాయిల్ నిజాయితీని అభినందించిన ఎస్ఐ ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం బాధితుడిని పిలిపించి ఫోన్‌ను అప్పగించారు.

# ఉపాధ్యాయులపై అదనపు భారం వద్దు

- బాహ్య మూల్యాంకన జీవో ఉపసంహరించుకోవాలి
- 1 నుండి 9వ తరగతి ఎక్స్‌టర్నల్ వాల్యుయేషన్‌పై డీటీఎఫ్, టీపీటీఎఫ్ తీవ్ర అభ్యంతరం

**నిజామాబాద్ సిటి, ఆగస్టు 31 (బతుకమ్మ) :** 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాలను మండల వనరుల కేంద్రాల్లో బాహ్య మూల్యాంకనం చేయించాలన్న ప్రభుత్వ నిర్ణయం అనాలోచితమైనదని, ఇట్టి ఉత్తర్వులను విద్యాశాఖ అధికారులు వెంటనే ఉపసంవరించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డిటిఎఫ్) నిజామాబాద్ జిల్లా శాఖ ఉపాధ్యక్షులు రాసరి పెంటన్న డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు నాన్-డిటెన్షన్ విధానం అమలులో ఉన్నందున, సమ్మేటివ్ పరీక్షల్లో విద్యార్థుల ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా సమయం వివిధ శిక్షణలు, ప్రాజెక్టులు, రాతపనులు, ఇతర కార్యక్రమాల వల్ల తగ్గిపోతోందని పేర్కొన్నారు. పాఠశాల విద్యలో అశాస్త్రీయమైన జీవో 25 అమలు చేస్తుండడం వల్ల ప్రాథమిక పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేక ఒకరిద్దరు ఉపాధ్యాయులతోనే అన్ని సబ్జెక్టులు బోధించాల్సి వస్తోందని, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎల్ఐపీ, ఎల్ఈపీ వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సిలబస్ పూర్తి చేయడమే కష్టంగా ఉన్నప్పుడు, బాహ్య మూల్యాంకనం పేరుతో ఉపాధ్యాయులను బోధనకు మరింత దూరం చేయడం విద్యార్థుల అభ్యసనకు వారి ప్రయోజనాలకు విరుద్ధమన్నారు.

**ఎక్స్ టర్నల్ వాల్యూయేషన్ వద్దు...**

సీసీఈ స్ఫూర్తికి విరుద్ధంగా కోత్త విదానం సర్కారు బడుల్లో విద్యార్థుల సమ్మేటివ్ అసెస్ మెంట్ పరిక్షల అన్సర్ షీట్లను ఇతర బడుల టీచర్లతో దిద్దించడాన్ని టిపిటిఎప్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని జిల్లా అధ్యక్షులె వెనిగళ్ల సురేష్ అన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనాన్ని సంబంధిత ఉపాధ్యాయులు తమకు లభించే సమయానుసారం నిర్వహించగలరని, బాహ్య మూల్యాంకనం వల్ల అదనపు పని భారం పెరగడంతో పాటు బోధనాభ్యసన ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు అదనపు బాధ్యతలు, ఎంఈవో బాధ్యతలతో తీవ్ర పని భారాన్ని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో ఇటువంటి అనవసరమైన విధానాలను ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థుల అభ్యసనపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని విద్యాశాఖ అధికారులు గ్రహించాలని ఆయన తెలిపారు. కావున 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాల బాహ్య మూల్యాంకనానికి సంబంధించిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



న్యాయవాదులు, పోలీసులతో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సరళ రాణి, అదనపు జడ్జి భవ్యశ్రీ

## న్యాయ వివాదాల పరిష్కారానికి
# 'లోక్ అదాలత్' ఉత్తమ మార్గం

- సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్
- విజయవంతం చేయాలని ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి సరళ రాణి పిలుపు..

**నిజామాబాద్ లీగల్, ఆగస్టు 31 (బతుకమ్మ) :** జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి ప్రతి ఒక్కరు సన్నద్ధులుకావాలని ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి సరళ రాణి కోరారు. జాతిహితంతో ముడిపడిన జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబర్ 12న నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్మూర్ మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్ కోర్టు ప్రాంగణంలోని కోర్టు హాల్ లో న్యాయ సేవల కమిటీ భాగస్వాములతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో సమావేశంలో ఆమె ప్రసంగించారు. న్యాయ దావాలు అన్ని రకాలవి, రాజీపడదగిన క్రిమినల్ కేసులు లోక్ అదాలత్ లో రాజీపద్ధతిన పరిష్కరించడానికి చట్ట సమ్మతి ఉన్నదని ఆమె తెలిపారు. పౌరసమాజంలో పౌరులు కలిసిమెలిసి జీవిస్తున్నందున కొన్ని బేధాభిప్రాయాలు రావచ్చని అవి క్రిమినల్ కేసులకు, సివిల్ కేసులకు దారి తీస్తున్నాయని అవన్నీ రాజీకి వీలున్నవేనని అన్నారు.

న్యాయ వివాదాలలో ఉన్నవారి అడుగులు జాతీయ లోక్ అదాలత్ వైపు పడాలని ఆమె ఆకాక్షించారు వ్యక్తుల మధ్య వివాదం వ్యవస్థకు చేటు చేస్తుం దని అంతిమంగా నష్టపోయేది వ్యక్తులేనని ఆమె పేర్కొన్నారు. ఒక మంచి లక్ష్యంతో నిర్వహిస్తున్న లోక్ అదాలత్ పౌర సమాజం సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని కోరారు. న్యాయవాదులు, పోలీసులు, కార్యనిర్వాహక వర్గం జాతీయ లోక్ అదాలత్ కు చేయూత అందించాలని అన్నారు.

అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవ్యశ్రీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమూహాలతో సంబం ధాలు ఉన్న వర్గాలుగా న్యాయ సంబంధిత వివాదాలలో ఉన్నవారిని లోక్ అదాలత్ వైపు మల్లించాలని ఆమె అన్నారు. ప్రజలతో నిత్య సంబంధాలు ఉన్న వర్గాలు ప్రజలను లోక్ అదాలత్ వైపు ప్రేరణ కలిగించాలని అన్నారు. ఆర్మూర్ రెవిన్యూ డివిజన్ పరిధి న్యాయ చైతన్యంతో కూడిన ప్రాంతమని ఆ చైతన్యశీలత రాబోయే జాతీయ లోక్ అదాలత్ లో కనబడాలని జడ్జి భవ్యశ్రీ ఆకాక్షించారు. కక్షలు కార్పణ్యాలు ఉండకుండా శాంతియుత సహజీవనం ప్రజల మధ్య ఉన్నప్పుడే సమాజ ప్రగతి సాధ్యమని నమ్మి జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ నాల్సా జాతీయ లోక్ అదాలత్ అనే మహాకార్యాన్ని నిర్వహిస్తున్నదని ఆమె తెలిపారు. ఆర్మూర్ బార్ అసోసియేషన్ కుదురుపాక ప్రవీణ్ చందర్ మాట్లాడుతూ అందరిని కలుపుకుని పోతున్న న్యాయ సేవ కమిటితో కలిసి నడుస్తామని తెలిపారు.

క్రిమి నల్ కేసులలో నేర ఆరోపణలు ఎదుర్కొంటున్న ముద్దాయిలను లోక్ అదాలత్ తమ కేసులను పరిష్కరించుకునే విదంగా ప్రోత్సహిస్తామని భీంగల్ పట్టణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. సమావేశంలో ఆర్మూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొడేటి శంకర్ మాట్లాడుతు ప్రతి లోక్ అదాలత్ కు సహకరించిన విదంగానే సెప్టెంబర్ లో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు వెన్నుదన్నుగా నిలుస్తామని అన్నారు. సమావేశంలో బార్ కోశాధికారి వద్నాల రాజేందర్, న్యాయవాదులు అవరి రమేష్, గణేష్, రాజేశ్వర్, ఆర్మూర్ అసిస్టెంట్ పోలీస్ కమిషనరేట్ సబ్ ఇన్స్పెక్టర్ లు తిరుపతి, రాము, సంజీవ్, ఆరాపత్, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.




# ప్రజాపాలనకు 1000 రోజులు

**ఇది సంక్షేమ పాలనలో చారిత్రక మైలురాయి!**
**రైతులు, మహిళలు, యువత ప్రయోజనాలే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన**
**టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**

**నిజామాబాద్, ఆగస్టు 31 (బతుకమ్మ):** ప్రజాపాలనలో 1000 రోజులు ఓ మైలురాయి అని టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1000 రోజుల పండుగలో విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేశామని,సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ, 25 లక్షల మంది రైతులకు రుణ విముక్తి, రైతు భరోసాను ఎకరానికి రూ. 12 వేలకు పెంచామన్నారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్ల బోనస్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేశామని,వ్యవసాయ రంగానికి రూ. 1.75 లక్షల కోట్లు ఖర్చు చేసి రికార్డు సృష్టించామన్నారు. రూ. 20 వేల కోట్లకు పైగా రుణమాఫీ, 25.35 లక్షల మంది రైతులకు లబ్ధి,రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లు అందించామని, ఉచిత వ్యవసాయ విద్యుత్‌కు రూ. 30 వేల కోట్లు ఖర్చు చేశామని,సన్నవడ్ల బోనస్‌కు దాదాపు రూ. 4 వేల కోట్లు కేటాయింపులు చేశామని, రైతుబీమాకు రూ. 3,500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500కే ఎల్పీజీ సిలిండర్ పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. పేదల ఆశలు నెరవేర్చే దిశగా 16.32 లక్షల కొత్త రేషన్ కార్డుల జారీ, 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులతో 3.43 కోట్ల మందికి ప్రయోజనం, తెలంగాణ యువతలో విశ్వాసం కలిగించేలా 70 వేలకు పైగా ప్రభుత్వ నియామకాలు,యువత నైపుణ్యాభివృద్ధికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహారం ప్రారంభం, 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం,బీసీ కులగణనతో సామాజిక న్యాయానికి పెద్దపీట, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయడం విప్లవాత్మక చర్య అన్నారు. రైతులు, మహిళలు, వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా మార్చామని, రాహుల్ గాంధీ సామాజిక న్యాయ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

## నిజామాబాద్ మాస్టర్ ప్లాన్ ఫైల్ వెనక్కి
# ప్రజాభిప్రాయంతోనే కొత్త డిజైన్

- గత ప్రభుత్వ ప్లాన్‌లో అనేక లోపాలు ఉన్నాయి..
- సవరణల తర్వాతే సీఎం ఆమోదానికి పంపుతాం
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్..



నగర అభివృద్ధి కమిటీ ప్రతినిధులతో మాస్టర్ ప్లాన్ అంశంపై చర్చిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 31 (బతుకమ్మ):** గత ప్రభుత్వం ప్రతిపాదించిన నిజామాబాద్ నగర మాస్టర్ ప్లాన్,అదేవిధంగా నూడ మాస్టర్ ప్లాన్‌లో అనేక లోపాలు ఉన్న దృష్ట్యా ఆ ఫైల్ ను వెనక్కి తెప్పిస్తామని పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. సోమవారం నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నగర అభివృద్ధి కమిటీ ప్రతినిధులకు గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్ పై ప్రజాభిప్రాయ సేకరణ, గతంలో అభ్యంతరాలు, మార్పులు కోరిన వారితో చర్చలు జరిపి సమగ్రంగా అందరి ఆమోదంతో మాస్టర్ ప్లాన్ ను ముఖ్యమంత్రి ఆమోదం కోసం పంపిస్తామని అన్నారు. ఆ మేరకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. నగర అభివృద్ధి కమిటీ నగరంలోని పలు ముఖ్య సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. అన్నింటిపై సంబంధిత అధికారులతో చర్చించి ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రోడ్ల నిర్మాణం,ఇతర అభివృద్ధి పనులకు నిధులు కేటాయించటం జరుగుతుందని ఆయన తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో నగరాభివృద్ధి కమిటీ అధ్యక్షులు ప్రసాద్ ప్రధాన కార్యదర్శి రామ్మోహన్ రావు, ఉపాధ్యక్షులు షేక్ హుస్సేన్ నారాయణరెడ్డి కరిపే రవీందర్, జహీరుద్దీన్, ముస్తఫా, నాగేశ్వరరావు, రాజు, సత్యం ఉన్నారు.

# ఉద్యమ నేత గైని గంగారామ్‌కు ఘన సత్కారం

- నలభై ఏళ్ల మచ్చలేని సేవలు
- అట్టహాసంగా టీఎన్జీవో నేత పదవీ విరమణ మహోత్సవం!
- గజమాలలతో హోరెత్తిన శ్రీరామ గార్డెన్స్
- హాజరైన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎమ్మెల్యే ధన్‌పాల్, జేఏసీ నేతలు



**నిజామాబాద్ రూరల్, ఆగస్టు 31 (బతుకమ్మ):** టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు, నీటిపారుదల శాఖ యందు వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తూ సూపరింటెండెంట్ గా పనిచేసిన గైని గంగారాం పదవి విరమణ మహోత్సవంగా జరిగింది. సోమవారం టీఎన్జీవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో నగరంలో గల శ్రీరామ గార్డెన్స్ టిఎన్ జిఓ నాయకుడిగా,తెలంగాణ ఉద్యమ నేతగా, ఇరిగేషన్ లో గత 40 సంవత్సరాలుగా పనిచేసిన గైని గంగారం పధవి విరమణ వేడుకలకు పిసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టిఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి . హుస్సేని (ముజీబ్), వ్యవసాయ శాఖ కమిషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడుపు గంగాధర్ , నుడా చైర్మన్ కేశవ వేణు తో పాటు ఇతర నాయకులు, ఉద్యోగులు గైని విద్యావతి–గంగారం ఆదర్శ దంపతులను శాలువ, గజమాలతో ఘనంగా సన్మానించి, ఆత్మీయ జ్ఞాపికను అందజేసి పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఉద్యోగ సంఘ నాయకులుగా ఉన్న సమయంలో తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రంలో నిజాంబాద్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత గైని గంగారం కే దక్కిందని కొనియాడుతూ వారి భావి జీవితం సుఖసంతోషలతో విరాజిల్లాలని కోరుతూ... పదవి విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్ , టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, టీఎన్జీవో కోశాధికారి నిరంజన్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు అన్ని శాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు.



నమూనా చిత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

## పట్టణంలో 54 అడుగుల
# భారీ మట్టి గణపయ్య

- పోచమ్మ గల్లీలో ప్రతిష్టించే విగ్రహ నమూనా చిత్రాన్ని ఆవిష్కరించిన నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- మట్టి విగ్రహాలనే వాడాలని పిలుపు

**నిజామాబాద్ సిటీ, ఆగస్టు 31 (బతుకమ్మ) :** నగరంలోని పోచమ్మ గల్లీ ఆధ్వర్యంలో శ్రీ రవితేజయూత్ సొసైటీ గణేష్ మండలి ప్రతిష్టత్మకంగా నెలకొల్పే 54అడుగుల మట్టి వినాయక విగ్రహం యొక్క నమూనా చిత్రం ను నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధనపాల్ సూర్య నారాయణ ఆవిష్కరించారి. సోమవారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సంధర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిజామాబాద్ పట్టణశీ లో అన్ని గణేష్ మండపలు కూడా మట్టి గణపతులను ఏర్పాటు చేయాలనీ సూచించారు ఈకార్యక్రమం లో అధ్యక్షులు నీలగిరి రాజు, ప్రధాన కార్యదర్శి తర్ల రమేష్, కోశాధికారి గైని మహేందర్, ఉపాధ్యక్షులు గైని దయసాగర్, లీగల్ అడ్వయిసార్ పులి జైపాల్, తర్ల రాజేందర్, కిరణ్ తేజ, రాము, వినయ్, మధు,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌కు
# 'ఎస్ఐఆర్' నోటీసు



**కామారెడ్డి, ఆగస్టు 31 (బతుకమ్మ):** కామారెడ్డి నియోజకవర్గానికి ఐదు సార్లు శాసనసభ్యుడిగా ప్రాతినిధ్యం వహించిన గంప గోవర్ధన్‌కు అధికారులు 'ఎస్ఐఆర్' నోటీసు జారీ చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. భిక్కనూరు మండలంలోని బస్వాపూర్‌లో ఉన్న ఆయన నివాసానికి బీఎల్ఓలు ఈ నోటీ సును అందించారు. 2002 నాటి ఓటర్ల జాబితాలో ఆయన తండ్రి పేరు 'వెంకయ్య' అని నమోదు కాగా, ఆధార్ కార్డులో మాత్రం ఇంటి పేరుతో కలిపి 'గంప వెంకయ్య' అని ఉండటం తో ఈ తేడాను సరిచేసుకోవాలని అధికారులు నోటీసు ఇచ్చా రు. తండ్రి పేరు పక్కన ఇంటి పేరు ఉందనే కారణంతో మాజీ ఎమ్మెల్యే స్థాయి వ్యక్తికే నోటీసు రావడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.